క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు పరామర్శ



వైఎస్సార్‌సీపీ కార్యకర్త అన్నపూర్ణమ్మను పరామర్శిస్తున్న గోవింద్

బీచ్ రోడ్డు: జీవీఎంసీ 22వ వార్డు సిద్ధార్థనగర్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త అన్నపూర్ణమ్మ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడింది. కాలు విరగడంతో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమెను శుక్రవారం ఆ పార్టీ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్ పరామర్శించారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బూత్ బీఎల్ఏలు గోవింద్, డేవిడ్ పాల్గొన్నారు.

వీసీసీఐ ఉమెన్స్ కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గం

బీచ్ రోడ్డు: వీసీసీఐ ఉమెన్స్ వింగ్ నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. శుక్రవారం నిర్వహించిన వార్షిక సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఎన్నికున్నారు. అధ్యక్షురాలిగా సంధ్యా రవి గోడే, ఉపాధ్యక్షురాలుగా అనిలా నార్ల, కార్యదర్శిగా పర్వీన్ హుసేన్, కోశాధికారిగా వాణి కంచర్ల ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారిని సభ్యులు అభినందించారు.

వెలగపూడికి అభినందన

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీ 17, 18 వార్డులకు చెందిన తోపుడు బండ్ల వర్తకుల సంఘం సభ్యులు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు అభినందనలు తెలిపారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఆయన మరోసారి ఎన్నికైన సందర్భంగా ఎంవీపీ కాలనీ సెక్టార్-4లోని కార్యాలయంలో వెలగపూడిని కలిసి సంఘం ప్రతినిధులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గొలగాని మంగవేణి, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ



విద్యార్థినికి పుస్తకాలు అందిస్తున్న హెచ్‌ఎం రామ్‌ప్రసాద్

సీతమ్మధార: పీ అండ్ టీ కాలనీలోని ఎస్ఎంసీ హైస్కూల్‌లో శుక్రవారం పదో తరగతి విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు డి.రామ్‌ప్రసాద్ పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ త్వరలోనే ఆరు నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు వైభవుడికి సుప్రభాత సేవ



మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరుగుతాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

విజ్ఞానం.. వినోదం



గ్రంథాలయంలో చదువుకుంటున్న యువత





వేసవి శిబిరంలో డ్రాయింగ్, (ఇన్‌సెట్) చెస్ పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

- ఎంవీపీ గ్రంథాలయంలో అందుబాటులో వేల చారిత్రక పుస్తకాలు
- సెలవుల్లో చిన్నారులకు విజ్ఞానం, క్రీడాంశాల్లో ప్రోత్సాహం

ఎంవీపీ కాలనీ: విజ్ఞాన వేదికగా ఎంవీపీ గ్రంథాలయం నిలుస్తోంది. స్థానిక యువత, చిన్నారుల విజ్ఞానానికి, క్రీడా ప్రోత్సాహానికి మార్గం చూపుతోంది. ఆసియాలోనే అతిపెద్ద కాలనీగా ఉన్న ఎంవీపీ కాలనీలో స్థానిక అవసరాలకు అనుగుణంగా ఈ గ్రంథాలయం సేవలు అందిస్తోంది. ఆరోగ్యం, ఆధ్యాత్మికం, విజ్ఞానం, చారిత్రక విషయ పరిజ్ఞానం ఇలా అన్ని రకాల పుస్తకాలను యువతకు అందిస్తూ వారి విజ్ఞానానికి బాటలు వేస్తోంది. వేసవి సెలవుల్లో ఈ గ్రంథాలయ సేవలు చిన్నారులు విరివిగా వినియోగించుకున్నారు. సబ్జెక్ట్స్‌తో పాటు సాంఘిక, సామాజిక, క్రీడాంశాల్లోను ఈ గ్రంథాలయ సేవలను అందిపుచ్చుకున్నారు.

ఇదీ గ్రంథాలయం ప్రస్థానం

ఎంవీపీ కాలనీలో గ్రంథాలయ సేవలు 1969లో ప్రారంభమయ్యాయి. తొలుత పూర్ణామార్కెట్ దరి రంగిరీజు వీధిలో ఉన్న ఓ గ్రంథాలయాన్ని పూర్తిస్థాయిలో ఎంవీపీ కాలనీకి తరలించారు. ఆనాటి నుంచి (1969) కాలనీలో గ్రంథాలయ సేవలు అందుబాటులోకి వచ్చాయి. జిల్లా ప్రధాన గ్రంథాలయం పరిధిలో ఈ గ్రంథాలయం దశాబ్దాలుగా స్థానికులు విశిష్టమైన సేవలు అందిస్తోంది. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 7 గంటల వరకు ఈ గ్రంథాలయం అందుబాటులో ఉంటుంది. ప్రతి శుక్రవారం గ్రంథాలయానికి సెలవు. ప్రస్తుతం యువత పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఈ గ్రంథాలయంలో అన్ని రకాల పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉంచారు.



ఎంవీపీ గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న పుస్తకాలు

అందుబాటులో ఉన్న పుస్తకాలు

సీనియర్ సిటిజన్స్, విద్యార్థులు, యువత అవసరాలకు అనుగుణంగా ఇక్కడ వేల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. కథలు, ప్రసిద్ధ నవలలు, ఆధ్యాత్మిక పుస్తకాలు, దేశ , విదేశాల చారిత్రక అంశాలతో కూడిన పుస్తకాలు, ప్రముఖుల ఆటోబయోగ్రఫీలు, ప్రాచీన సంస్కృతిని ప్రతిబింబించే పుస్తకాలు, సామాజిక స్పృహను చైతన్య పరిచే పుస్తకాలు, శాస్త్ర, సాంకేతిక అంశాలతో కూడిన వైజ్ఞానిక పుస్తక సంపద ఈ గ్రంథాలయంలో అందుబాటులో ఉంది. దీంతో పాటు ఇంగ్లిష్ గ్రామర్ నాలెడ్జ్ పెంచుకొని పుస్తకాలు, యోగా, ఆయుర్వేద మెలకువలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి.

అన్నింటా యువత భాగస్వామ్యం



విద్యార్థులకు, యువతకు కావాల్సిన అన్ని రకాల పుస్తక విజ్ఞానం ఎంవీపీ గ్రంథాలయంలో అందుబాటులో ఉంది. ఇటీవల 24 రోజుల పాటు స్కూల్స్ చిన్నారులకు వేసవి ప్రత్యేక శిక్షణ శిబిరాన్ని విజయంతంగా నిర్వహించాం. ఇంగ్లిష్ గ్రామర్, మ్యాథమెటిక్స్, జనరల్ సైన్స్‌తో పాటు జీకే విజ్ఞానాన్ని పెంపొందించాం. కథలు చెప్పడం, చదివించడం, న్యూస్ రీడింగ్, క్విజ్ పోటీలు, డ్రాయింగ్, పేపర్ క్రాఫ్ట్స్ తయారీ శిక్షణ ఇచ్చాం. చిన్నారుల్లో మానసిక ఉత్తేజాన్ని నింపేలా క్రీడలు సైతం ఆడించాం. ప్రముఖుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యక్రమాలు ఇలా అన్నింటా గ్రంథాలయ సేవల్లో యువతను భాగస్వామ్యం చేశాం.

– ఉమామహేశ్వరరావు, లైబ్రేరియన్, ఎంవీపీ కాలనీ గ్రంథాలయం

28న 100వ తపాలా డాక్ అదాలత్

ఎంవీపీ కాలనీ: తపాలా వినియోగదారుల సమస్యలు, ఫిర్యాదుల పరిష్కారానికి ఈ నెల 28న ఎంవీపీ కాలనీలోని తపాలా శాఖ రీజనల్ కార్యాలయంలో 100వ తపాలా డాక్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఆర్ఎంఎస్-వీ డివిజన్ సూపరింటెండెంట్ ప్రసన్నరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. 100వ డాక్/ పెన్షన్స్ అదాలత్‌గా దీన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

అల్లూరి, పార్వతీపురం, కోనసీమ, కాకినాడ, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, తూర్పు గోదావరి జిల్లాలకు చెందిన తపాలా వినియోగదారులు తమ సమస్యలను ఈ నెల 21వ తేదీలోపు ఎంవీపీ కాలనీలోని రీజనల్ కార్యాలయం చిరునామాకు అందజేయాలన్నారు. అనంతరం 28వ తేదీ జరిగే డాక్ అదాలత్‌లో వాటిని పరిష్కరించనున్నట్లు తెలిపారు.

మందుబాబులకు రూ.35 వేల జరిమానా

సీతమ్మధార: ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన 8 మందికి ఐదో స్పెషల్ మెట్రోపాలిటిన్ మేజిస్ట్రేట్ కోర్టు రూ.35 వేల జరిమానా విధించింది. ఒక్కొక్కరికి రూ.2 వేల నుంచి 3 వేలు అపరాధ రుసుము విధించినట్లు ద్వారకా ట్రాఫిక్ ఎస్ఐ భాస్కరరావు తెలిపారు.

స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకుందాం

సీతమ్మధార : ప్రాణత్యాగం చేసైనా విశాఖ స్టీల్ ప్లాంట్‌ను రక్షించకుందామని సీఐటీయూ జిల్లా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ వై.రాజు అన్నారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జరుగుతున్న నిరాహారదీక్ష 1141వ రోజు శిబిరంలో ఆయన మాట్లాడారు. అఖిలపక్ష కార్మిక, విద్యార్థి, యువజన, మహిళా, మేధావులు అందరూ ఒక్క తాటిపైకి వచ్చి పోరాటం సాగిస్తున్నట్లు తెలిపారు. స్టీల్‌ప్లాంట్ లాభాల్లో నడుస్తోందన్నారు. అటువంటి సంస్థను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తే ఉన్న ఉద్యోగాలు పోవడంతో పాటు తర్వాతి తరాలకు ఉపాధి ఉండదన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు కేంద్రంతో మాట్లాడి ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలన్నారు. అలాగే విశాఖ ఎంపీతో పాటు శాసనసభ్యులందరు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడితో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై మాట్లాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్, భవన నిర్మాణ కార్మిక నాయకులు కె.నర్సింగరావు, ఎర్రిబాబు, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద దీక్షలో పాల్గొన్న నాయకులు

దేవస్థానం పాఠశాలలో సకల సౌకర్యాలు

- ఈవో శ్రీనివాసమూర్తి
- విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన సంస్కృతోన్నత పాఠశాల ఆవరణలోనే విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం కల్పిస్తామని సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. అందుకు సంబంధించి ఏర్పాట్లు చేయాలని దేవస్థానం ఈఈ రాంబాబును ఆదేశించారు. పాఠశాలను శుక్రవారం ఈవో సందర్శించారు. 1994-95,2002-03 బ్యాచ్‌లకు చెందిన విద్యార్థులతో పాటు మాస్టర్ ఈకే స్పిరిచ్యువల్ సేవా సంస్థలు, గొడవర్తి వంశీ అండ్ ఫ్రెండ్స్ వితరణగా అందించిన నోట్ పుస్తకాలను ఈవో విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవస్థానం సంస్కృతోన్నత పాఠశాలకు ఎంతో ఘనకీర్తి ఉందన్నారు. ఇక్కడ చదివిన విద్యార్థులు దేశవిదేశాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని వివరించారు. ముఖ్యంగా హాస్టల్ ఒకచోట, పాఠశాల మరో చోట ఉండటం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు గ్రహించామన్నారు. త్వరలోనే పాఠశాల క్యాంపస్‌లోనే హాస్టల్ కూడా ఏర్పాటు చేస్తామన్నారు. పాఠశాల సూపరింటెండెంట్ విక్రమ్, ప్రధానోపాధ్యాయురాలు భాను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో పి. శ్రీనివాసుల రెడ్డి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్లు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. ఏఈవోలు తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు పాల్గొన్నారు.



నేడు సహస్ర తులసీదళార్చన

కనకమహాలక్ష్మి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూబీఐ, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి.

బీఆర్‌టీఎస్‌లో హైమాస్ట్ వెలుగులు

ఆరిలోవ: హనుమంతవాక నుంచి అడవివరం వరకు ఉన్న బీఆర్‌టీఎస్ మార్గంలో జీవీఎంసీ ఇటీవల హైమాస్ట్ దీపాలు ఏర్పాటు చేసింది. కూడళ్లలో వాటిని అమర్చారు. విమ్స్ కూడలి, దీన్‌దయాల్‌పురం, రామకృష్ణాపురం కూడళ్లలో ఏర్పాటు చేశారు. రాత్రి వేళ ఇవి వెలుగులు విరజిమ్ముతున్నాయి. దీంతో కూడళ్ల వద్ద వాహనచోదకులకు చీకటి సమస్య తీరింది. విశాలమైన ఈ కూడళ్లలో సాధారణ దీపాలు నుంచి వచ్చే వెలుగులు చాలకపోవడంతో గతంలో వాహనచోదకులు రోడ్డు దాటే సమయంలో ఇబ్బంది పడుతూ ప్రమాదాలకు గురవుతుండేవారు. ఇప్పుడే ఆ సమస్య తీరందని వాహన చోదకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



బీఆర్‌టీఎస్ దీన్‌దయాల్‌పురం కూడలి వద్ద ఏర్పాటు చేసిన హైమాస్ట్ దీపాల వెలుగులు

కోవిడ్ సేవలకు గుర్తింపు

మద్దిలపాలెం : విపత్కర పరిస్థితిల్లో నిస్వార్థంగా, విధి నిర్వహణలో విశిష్టమైన సేవలు అందించడం ద్వారా ఆ వృత్తికి సార్థకత లభిస్తుందని మలేరియా సబ్ యూనిట్ అధికారి నగేష్ పట్నాయక్ అన్నారు. జిల్లా మలేరియా సబ్ యూనిట్‌లో సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహించి, పదవీ విరమణ చేసిన పి.రామకోటి అప్పారావును కోవిడ్ విపత్కర పరిస్థితిలో అందించిన సేవలకు మదర్‌థెరిసా ఆర్గనైజేషన్ బంగారు పతకం బహూకరించింది. ఈ అవార్డు తీసుకున్న సందర్భంగా శుక్రవారం రామకోటి అప్పారావును మద్దిలపాలెంలోని మలేరియా సబ్‌యూనిట్ కార్యాలయంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మలేరియా సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.



అవార్డు పొందిన అప్పారావును సత్కరిస్తున్న మలేరియా సబ్ యూనిట్ అధికారి నగేష్

శ్రావ్యంగా కచేరీ

మద్దిలపాలెం : విశాఖ మ్యూజిక్ అకాడమీ యువజన వార్షికోత్సవాలు మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కోటా గాయత్రి వరేణ్య, మాస్టర్ సాయికేశవ్ సబేశన్‌ల బృందం నిర్వహించిన వయోలిన్ కచేరీ శ్రావ్యంగా సాగింది. అనంతరం గాత్ర కచేరీలో ఘట్టి శ్రీవిద్య భక్తి గీతాలు ఆలపించి అలరించారు. ఈ కార్యక్రమాన్ని వీఎంఏ కార్యదర్శి ఎం.ఎస్.శ్రీనివాస్, కృష్ణారావు, అయ్యంగారి భుజంగరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. రెండు రోజుల పాటు సంగీత యువజనోత్సవాలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.



కచేరీలో ఘట్టి శ్రీవిద్య బృందం

సమాజాభివృద్ధికి శాస్త్ర విద్య దోహదం

- ఆర్జేడీ విజయభాస్కర్

సింహాచలం: శాస్త్ర విద్య అనేది సమాజ అభివృద్ధికి ఆధారమైనది.. జీవశాస్త్రాన్ని బోధించే ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు శాంకేతికతను అప్‌గ్రేడ్ చేసుకుంటూ నాణ్యమైన బోధనను అందించాలని ఆర్జేడీ విజయభాస్కర్ సూచించారు. అడవివరం జిల్లా పరిషత్ హైస్కూల్లో విశాఖ జిల్లాలోని జీవశాస్త్ర ఉపాధ్యాయులకు నైపుణ్యాల పెంపుపై శుక్రవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. జిల్లాలోని పలు పాఠశాలలకు చెందిన 250 మంది జీవశాస్త్ర ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఆర్జేడీ మాట్లాడుతూ శాస్త్ర విద్య ఎంత నేర్చుకున్నా తరగనిదన్నారు. కొత్తగా ఆలోచించాలని, విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలన్నారు. డీఈవో చంద్రకళ మాట్లాడుతూ ఉపాధ్యాయులు శాస్త్ర నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడం కోసం ఓరియంటేషన్ తరగతులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అడవివరం జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ఇమంది పైడిరాజు, రిసోర్సు పర్సన్స్ బాబూరావు, జి.చంద్రమౌళి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్జేడీ విజయభాస్కర్

కేరాఫ్ ఫుడ్‌పాత్



రకరకాల వంటకాలతో బారులుతీరిన మొబైల్ వాహనాలు

మామూళ్ల బెడద లేదు. కరెంటు.. షాపు అద్దె లేదు. ఒకే వ్యాపారం చేయాలన్న ఒత్తిడి లేదు. నచ్చిన చోట మెచ్చిన వ్యాపారం చేసుకోవచ్చు. టిఫిన్ సెంటర్ నుంచి షర్బత్ బండి వరకూ ఏదైనా చేసుకునే వెసులుబాటు.. వినియోగదారులు మెచ్చే ఆహారం.. మొబైల్ బిజినెస్ ఇప్పుడు ఎవర్‌గ్రీన్ ట్రెండ్..

- వినియోగదారులు కోరుకునే చోటే ఆహారం.. పానీయాలు
- పనికి ఆటంకం లేదని.. సమయం కొలిసొస్తుందంటున్న కస్టమర్లు
- ఫుడ్ ఆన్ వీల్స్‌కు చిరునామా సౌత్ జైల్‌రోడ్డు

దాబాగార్డెన్స్ : పట్టణీకరణ పెరగడంతో మనుషుల అవసరాలు, ఆలోచనల్లో కూడా చాలా మార్పులు వచ్చాయి. బిజీ బిజీ జీవనంలో ప్రతీది శుచి, శుభ్రతతో ఉన్న వస్తువులు తమ వాకిట్లోకి, లేదా తాము విధులు నిర్వహించే చోట, ఆఫీసుకు వెళ్లే మార్గంలో ఉంటే బాగుంటుంది అనుకుంటున్నారు. జీవనం యాంత్రికం అయిపోవడంతో హోటళ్లు, షాపులకు వెళ్లే సమయం చాలా మందికి దొరకడం లేదు. దీంతో వినియోగదారుల అవరాలకు తగిన విధంగా వ్యాపారులు సైతం సిద్ధం అవుతున్నారు. ఇప్పుడు మొబైల్ హోటళ్లు, షర్బత్‌లు వినియోగదారులకు ఇట్టే అందుబాటులోకి వస్తున్నాయి. చివరకు కొబ్బరి బొండాలు.. పలు రకాల పండ్లు వంటివి కూడా ఆటోల్లో అమ్మేస్తున్నారు. దీని వల్ల వినియోగదారుల చెంతకే ఆహార పదార్థాలు చౌక ధరలకు అందడం ఒక విషయమైతే.. వ్యాపారులు కూడా ఒకే చోట ఉండి అక్కడి పరిస్థితుల మీదనే ఆధారపడకుండా ఎక్కడ, ఏ సమయంలో మంచి వ్యాపారం జరుగుతుందో అక్కడికి వెళ్లిపోతున్నారు. పైగా ఈ వాహనాల్లోని ఆహార పదార్థాలు శుచి, శుభ్రత, నాణ్యంగా ఉండటంతో వినియోగదారుల నుంచి ఆదరణ లభిస్తోంది. ప్రస్తుతం నగరంలో గజం స్థలం ధర చుక్కలంటడం, పైగా రోడ్డు పక్కన తోపుడు బండి పెట్టుకుందామన్నా రకరకాల ఒత్తిళ్లు, మామూళ్ల బెడద పెరిగిపోవడం, కరెంటు, షాపు అద్దెలాంటి ఇబ్బందుల వల్ల ఈ మొబైల్ వ్యాపారమే బేషుగ్గా ఉందని వ్యాపారులు అంటున్నారు. వినియోగదారులు హోటళ్లకు వెళ్లి వేచి ఉండాల్సిన పని లేకుండా పనులకు వెళ్లే దారిలోనే టిఫిన్, కొబ్బరి బొండాలు, షర్బత్ వంటివి దొరుకుతున్నాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి వ్యాపారాలు జీవీఎంసీ పరిధి దక్షిణ నియోజకవర్గంలో కోకొల్లలు. సౌత్ జైల్‌రోడ్డులో ఫుడ్ ఆన్ వీల్స్ ఘుమఘుమలు పంచుతున్నాయి.



జూ రోడ్డులో టూ వీలర్ ద్వారా తాటిబెల్లం, తాటితాండ్ర, మామిడితాండ్ర, పూతరేకుల విక్రయం



ఫాస్ట్‌ఫుడ్ మొబైల్ వాహనం

ఫుడ్ ఆన్ వీల్స్‌కు కేరాఫ్ సౌత్ జైల్‌రోడ్డు..

సాయంత్రమైతే చాలు.. సౌత్ జైల్‌రోడ్డులో గల విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలకు ఎదురుగా ఉన్న సర్వీస్ రోడ్డులో వందలాది బళ్లలో కోరుకునే ఆహారం దొరుకుతోంది. చేతిలో కార్డు ఉండే చాలు.. ఏం కావాలో అవి తినవచ్చు. ఏటీఎం డెబిట్/క్రెడిట్ కార్డ్స్‌తో పాటు పేటీఎం.. గూగూల్ పే.. ఇలా ఎన్నో రకాల వెసులుబాటుతో కోరింది తిని బిల్ చెల్లించుకోవచ్చు. సాయంత్రం 4 నుంచి అర్ధరాత్రి వరకు ఇక్కడ టిఫీ.. నూడిల్స్.. చికెన్ జాయింట్స్.. ఫ్రైడ్ రైస్.. ఇలా అన్ని రకాల వంటకాలతో పాటు చల్లని పానీయాలు కూడా మొబైల్ వ్యాన్లలో లభిస్తున్నాయి.

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ



శ్రీవారికి సమర్పించేందుకు పట్టు వస్త్రాలను తీసుకుని వస్తున్న అర్చకులు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించేందుకు శేషవస్త్రాన్ని, అభిషేక సామగ్రిని ప్రదక్షిణగా మంగళవాయిద్యాల నడుమ తీసుకుని వెళ్లి అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో వేద పండితులు, అర్చకులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం అనంతరం సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం,జీలకర్రబెల్లం , మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం అధికారులు అందజేశారు.